
# పోతన భాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 121 వ భాగం

## పురంజనోపాఖ్యానం 14

ముందుగా పాఠకులకి నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ వ్యాసంతో నేను, ఈ రసగుళికలు పదకొండో ఏట ప్రవేశిస్తున్నాం. ఈ పదేళ్ల ప్రస్థానం గురించి ఈ వ్యాసం చివరలో నా స్పందన కూడా రాసాను. గడచిన నూట ఇరవై నెలలూ వీటిని అదరించిన కౌముది పత్రికా సంపాదకులు కిరణ్ ప్రభ గారికీ, పాఠకులకీ, అంతర్జాలంలో పోతన తెలుగు భాగవతాన్ని పద్య, అర్ధ, టీక, భావాలతో విపులంగా పెట్టి నాలాంటి వారికి ఎనలేని సేవలు చేస్తున్న ఊలపల్లి సాంబశివరావుగారికీ, వారి స్నేహితులకీ అనేకానేక ధన్యవాదాలు, వందనాలు. వీటిని ఇంకా కొనసాగించాలనే ఈ ప్రయత్నం. భాగవతంలో ఇప్పటివరకూ కొన్ని కొన్ని ఘట్టాలు మాత్రమే రాసాను. ఇంకా మిగిలినవి రాయడానికి మరో పదేళ్ళు పట్టినా ఆశ్చర్యం లేదు ఎందుకంటే భగవంతుడి లీలలూ, పోతన భాగవతం ఒక మహా సముద్రం లాంటివి. ఎప్పుడు దాన్ని పూర్తిగా ఈదగలము అనేది ఎవరూ చెప్పలేరు. నిజానికి ఈదలేము కూడా. ముందు ఎలా ఎన్ని వ్యాసాలు రాయగలను అనేది పోతన చెప్పినట్టూ – పలికించెడు వాడు – చూసుకుంటాడనీ, మీరూ ఆదరిస్తారని ధీమాతో కొనసాగిస్తున్నాను.

ప్రచేతసులు పరమేశ్వరుడు తమకి చెప్పిన అచ్యుత స్తవం చేస్తూ ఉగ్రమైన తపస్సు మొదలుపెట్టారు కదా? వారి తండ్రి ఎప్పటిలాగానే యజ్ఞాలు చేస్తున్నాడు. ఆ రోజుల్లో అమలులో ఉన్న పద్ధతులు తనకి తెలిసినవి పాటిస్తూ. అయితే ఈ యజ్ఞాలలో అతిగా జంతు బలులు ఇస్తున్నాడు కాబోలు. ఇవన్నీ తగదు భగవంతుణ్ణి చేరడానికి అని ఎవరో చెప్పాలి. ఆ చెప్పేది ప్రజలో తన స్వంత మంత్రో అయితే వినవచ్చు లేదా వినకపోవచ్చు. ఓ ఋషి గానీ ముని గాని అయితే సరిగ్గా వింటారు. అందువల్ల కొడుకులే మంచి తపస్సు చేస్తూంటే తండ్రి ని కూడా మంచి దారిలో పెట్టడానికి మహర్షి నారదుడు బయల్దేరి వచ్చాడు.

వ. ఘనకర్మాసక్త చిత్తుండై యున్న ప్రాచీనబర్హి కడకు నధ్యాత్మవేదియుం గృపాళువు నైన నారదుండు చనుదెంచి యా రాజునకు జ్ఞానబోధంబు చేయు కొఱకు నతనితో నిట్లనియె "రాజా! యీ కర్మంబునం జేసి యెట్టి శ్రేయస్సు నభిలషించుచున్నవాఁడ వట్టి యనిష్ఠ నిరసనంబు నభీష్ట ప్రాప్తి కరంబు నయిన శ్రేయం బీ కర్మంబు వలన లభింప" దనినం బ్రాచీనబర్హి నారదున కిట్లనియె. [4-738]

వచ్చిన నారదుడు కృపాళువు కనకా భగవంతుణ్ణి చూసినవాడు కనకా ఇప్పుడు చెప్తున్నాడు – ఈ కర్మలన్నీ చేస్తున్నావు ఏదో శ్రేయస్సు కోసం; అయితే ఆ శ్రేయస్సు మాత్రం నీకు లభించదు. అప్పటివరకూ ఇదే సరైన పద్ధతి అనుకున్న ప్రాచీనబర్హి ఆశ్చర్యపోయేడు. అలాగైతే నాకు జ్ఞానమార్గం ఉపదేశించండి అన్నాడు. దానికి నారదుడు ఏమంటున్నాడో గమనించండి.

క. అనవుఁడు నతనికి నతఁ డను
ననఘా! యీ యధ్వరంబులందును గృపమా
లిన నీచే విశసింపం
జని కూలిన పశుల వేల సంఖ్యలఁ గనుమా [4-740]

నువ్వు చేసిన యజ్ఞజాగాదుల్లో ఎన్ని పశువులని చంపావో ఓ సారి చూడు. ఈ పశువులని కూడా ఎలా కూల్చాడో చెప్తున్నాడు – కృపమాలిన – కనికరం లేకుండా చంపాడు. వాటిని తిండికోసమో మరో దానికో అత్యవసరంగా చంపితే అప్పటి రోజుల్లో ధర్మం ప్రకారం కుదురునేమో మనకి తెలియదు. అది అలా ఉంచుదాం కానీ యజ్ఞం కోసం – అదీ తాత, తండ్రీ చేసినట్టు చేయాలనే ఉత్సుకత మాత్రం చేతనే – చంపడం అనవసరం, పాపం కూడా. కర్మ ఎప్పటికైనా అనుభవించవల్సిందే కదా అందువల్ల ఇప్పుడు ఈ చచ్చిపోయిన పశువులు ఏం చేస్తాయి?

వ. కావునం బశువ్రాతంబులు త్వదీయ వైశసంబును స్మరించుచున్నవై లోహయంత్రమయ శృంగంబులచేత నెప్పుడు నీవు పరలోకంబు నొందెద వప్పుడు నిన్ను హింసింతు మని భవదీయ మృతికి నెదురు చూచుచున్న; విట్టి సంకటంబు నొందంగల నీకు నిస్తారకం బయిన యొక్క యితిహాసంబు గల దెఱింగింతు విను" మని యిట్లనియె. [4-741]

ఈ పశువులన్నీ నీ కోసం పరలోకంలో కాసుకుని కూర్చున్నాయి లోహంతో చేసిన కొమ్ములతో. ఎప్పుడు నీకు భూమి మీద నూకలు చెల్లుతాయో అప్పుడు చీల్చిచెండాడడానికి వేచి చూస్తున్నాయి. అయితే ఇటువంటి సంకట స్థితిలో ఉన్న నీకు పనికొచ్చే కథ ఒకటి ఉంది. చెప్తాను విను అని మొదలుపెట్టాడు. ఇక్కడనుంచి మనకోసమే రాసినట్టు ఉండే భాగవతంలో ఈ విషయాలు జాగ్రత్తగా చదివి అర్థం చేసుకునేవి చాలా ఉన్నాయి.

సీ. భూమీశ! విను మయ్య పూర్వకాలమునఁ బు
రంజనుం డను నొక్క రాజు గలఁడు;
అతని కవిజ్ఞాతుఁ డనుపేరఁ దగిలి వి
జ్ఞాతచేష్టితుఁ డగు సఖుఁడు కలఁడు;
ఆ పురంజనుఁడు పురాన్వేషియై ధరా
చక్రంబుఁ గలయంగ సంచరించి
తన కనురూపమై పెనుపొందు పుర మెందు
వీక్షింపఁ జాలక విమనుఁ డగుచు [4-742]

తే. నే పురము లుర్విఁ బొడఁగనె నా పురములు
గామములఁ గోరు తనకు న క్కామములను
బొందుటకు వానిని ననర్హములుగఁ దన మ
నమునఁ దలఁచి యొకానొకనాఁ డతండు. [4-742.1]

పురంజనుడనే రాజు ఒకడుండేవాడు. అతనికి అవిజ్ఞాతుడనే స్నేహితుడు ఉన్నాడు. ఈ స్నేహితుడు విజ్ఞాతచేష్టితుడు (విజ్ఞాత – తెలిసిన, చేష్టితుడు – చేతలు కలవాడు). ఈ స్నేహితుడికి అన్నీ తెలుసు. పురంజనుడు బతకడం కోసం ఒక పురాన్ని – ఉండే చోటుని, వెదికి వెదికి ఎక్కడ ఉండాలా అని చూస్తున్నాడు. అవి ఎక్కడా కనబడలేదు. (అనర్హములు అని మనసులో తలిచాడు). ఈ పద్యం లో అవిజ్ఞాత అనే పదం చూడగానే మనకి గుర్తొచ్చేది ఏమిటి? ధర్మగుబ్ధర్మకృద్ధర్మీ సదసత్క్షరమక్షరం, అవిజ్ఞాతా సహస్రాంశుర్విధాతా కృతలక్షణః (విష్ణు సహస్రనామం – 51) అవిజ్ఞాత – తెలుసుకునేవాడి కంటే విలక్షణమైనవాడు – భగవంతుడు.

పోతన ఈ పద్యాలలో విజ్ఞాత, అవిజ్ఞాత అనే పదాలు ఎలా కలిపాడో గమనించారా? ఇందులో గూఢంగా చెప్పే మరో విషయం ఒకటుంది గమనించండి. మానవుడైన వాడికి నిజమైన స్నేహితుడు తనలో ఉన్న ఆత్మ స్వరూపుడైన ఆ భగవంతుడు ఒక్కడే. మిగతావారు లెక్కలేనన్ని జన్మ మృత్యు పరంపరలో ఎంత కాలం వస్తారో ఎవరికీ తెలియదు. ఎవరైనా సరే తనకూడా కొంతకాలం రావచ్చు, పోవచ్చు. అందుకే పురంజనుడికి అవిజ్ఞాతుడు అసలు సిసలు స్నేహితుడు. ఇదే నారాయణ సూక్తం, మంత్రపుష్పంలో చెప్పబడే – నారాయణ పరో ధ్యాతా ధ్యానం నారాయణః పరః

సీ. వర నవద్వార కవాట గవాక్ష తో
రణ దేహళీగోపురముల నొప్పి
ప్రాకార యంత్రవప్రప్రతోళీ పరి
ఘట్టాల కోపవనాళిఁ దనరి
సౌవర్ణ రౌప్యాయస ఘన శృంగంబుల
రమణీయ వివిధ గేహముల మించి
రథ్యాసభా చత్వరధ్వజ క్రీడాయ
తన సుచైత్యాపణతతిఁ దనర్చి [4-744]

తే. మరకతస్పటిక విదూరమణి వినూత్న
మౌక్తికాయుత ఖచిత హర్మ్యములు గలిగి
విద్రుమద్రుమ వేదుల వెలయు నొక్క
పురముఁ గనియె భోగవతినిఁ బోలు దాని. [4-744.1]

ఇలా కొన్నాళ్ళు వెతికాక నవద్వారాలతో ఉండే ఒక పురం కనిపించింది. ఈ ద్వారాలు - కావాల్సినవి పురంలోకి తెచ్చుకోవడానికీ, అక్కర్లేనివి బయటకి పంపడానికీ వాడుకునేవి. పురంలో అన్నీ వెండి బంగారం, ఇనుము తో చేయబడి ఉన్నాయి. భవంతులన్నీ మరకత (పచ్చలు), స్పటిక విదూర (వైఢూర్యము) మణులతో నిండి ఉన్నాయి. ఆ పురం నాగులు నివశించే భోగవతీ పట్టణంలా ఉంది. ఈ పద్యంలో వెండి బంగారం ఇనుము అనేవి ఎక్కడున్నాయో చెప్పగలరా? సౌవర్ణ రౌప్యాయస; సౌవర్ణ – బంగారము, రౌప్య – వెండి, ఆయస – ఇనుము.

వ. ఇట్లు గనుంగొని యనంతరంబ ముందటం బురబాహ్యాంతరంబున దివ్యద్రుమ లతాకుంజ పుంజంబును, సమద నదద్విహంగ మత్త మధుకరకుల కోలాహల సంకుల జలాశయ శోభితంబును, హిమనిర్ఝరబిందు సందోహ పరిస్పంద కందళిత మందమలయ మరుదుచ్ఛలిత ప్రవాళవిటప నళినీతటంబును, పాంథజన మనోరంజ నాహ్వాన బుద్ధిజనక కలహంస రాజకీర కోకిలాలాప విరాజమానంబును; మునివ్రత నానావిధ వనమృగవ్రాత బాధారహితంబును నైన పురబాహ్యోద్యానవనంబు నందు యాదృచ్ఛికంబుగ నేకైక శతనాయకం బైన యనుచర దశకంబును, బంచమస్తకసర్ప ప్రతీహారుండును, దోడరాఁ జనుదెంచుచున్న భర్త్రన్వేషిణియుం గామరూపిణియు నవోఢయు నయినట్టి. [4-745]

ఈ పురంలో ఆయనకి యాదృచ్ఛికంగా భర్త కోసం అన్వేషిస్తూ తిరుతున్నఒకావిడ కనిపించింది. ఈవిడ కామరూపిణి. ఈవిడ దగ్గిర పదిమంది అనుచరులున్నారు (అనుచర దశకంబు). ఒక్కో అనుచరుడికీ నూరు మంది నాయకులు. ఐదు తలల నాగు (పంచ మస్తక ప్రతీహారుండు) ఆవిడ ముందు నడుస్తూ ఉంది కావలిగా.

వ. మఱియును బాలయు సుదతియు గజగామినియు నయిన యొక్క ప్రమదోత్తమం గాంచి. [4-747]

క. తరమిడి ప్రేమోద్ధతమై
మరువిండ్లం బోలు కన్బొమలు గల తరుణీ
సరసాపాంగ విలోకన
శరపరివిద్ధాంగుఁ డగచు జనవిభుఁ డనియెన్. [4-748]

పురంజనుడు ఈవిడని చూసి మనసు పారేసుకున్నాడు. ఎలాగంటే ఆవిడ చూపులనే బాణాలు తన శరీరానికి తగిలినట్టు అయ్యాక. ఆ బాణాలు ఎటువంటివి? మన్మధుడి బాణాల వంటివి (మరువిండ్లం బోలు) పై వచనంలో ప్రమదోత్తమ అంటే – ఉత్తమ యౌవనం గల స్త్రీ.

క. ఎవ్వరి దానవు? జనకుం
దెవ్వఁడు? పేరేమి? భృత్యు లీ పదియొక రిం
దెవ్వరు? సతు లెవ్వరు? మఱి
యివ్వనమున నుండఁ గార్యమెద్ది? మృగాక్షీ! [4-749]

క. భవదీయ పురస్సరుఁ డగు
పవనాశనుఁ డెవ్వఁ? డతికృపామతి నాకున్
వివరింపు" మనుచు వెండియు
ధవళేక్షణఁ జూచి ధరణిధవుఁ డిట్లనియెన్. [4-750]

ఇప్పుడు పురంజనుడు ఆవిడని అడుగుతున్నాడు. నువ్వెవరివి, నీ తండ్రి ఎవరు? పేరేమిటి? కూడా వచ్చే ఈ పదిమందీ, వారి సేవకులూ ఎవరు? ఈ వనంలో ఎందుకిలా తిరుగుతున్నారు? ముందు నడిచే ఈ ఐదు తలల పాము ఏమిటి? అవన్నీ నాకు చెప్పు. ఈ పద్యంలో పాము ని పోతన ఏమన్నాడో గమనించండి — పవనాశనుడు. పవన — గాలి; అశనుడు — తినేవాడు. పురంజనుడు అడిగిన ఈ ప్రశ్నలకి సమాధానం వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

దశ వర్షమ్ - పది సంవత్సరాలు - నూట ఇరవై నెలలు

కౌముది పత్రికలో పోతన రసగుళికలు

ఈ ఏడు మార్గశిర మాసంతో (డిసెంబర్) తో నేను కౌముది పత్రికలో పదేళ్ళు - నూట ఇరవై భాగవతం మీద వ్యాసాలు పూర్తి చేసాను. మొదట్లో ఇవి రాయడం మొదలు పెట్టడానికి కారణం చెప్తాను ముందు. స్కూల్ చదువులో మొదటి సారి పోతన పద్యం "ఎవ్వనిచే జనించు...." అన్నది చదవగానే అందరికి మల్లే ఆ పద్యానికి, అర్థానికి ఆకర్షితుణ్ణయ్యాను. అయితే ఆ రోజుల్లో పూర్తి భాగవతం చదువుదామంటే నాకు కనబడిన గ్రంథాలయాల్లో ఎక్కడా లేదు. కొనడానికి డబ్బులూ లేవు, నిజంగా అప్పట్లో ఆ గ్రంథం అమ్మకం లో ఉండి ఉంటే. అలా రోజులు గడిచాక ఇంట్లోంచి బయటకి వెళ్ళాను చదువు కోసం తెలుగేతర రాష్ట్రానికి. తెలుగు "మా-త్ర-మే" వచ్చిన నేను మొదట్లో కష్టంగా గడిపాను

తెలుగు ఎవరితోనూ మాట్లాడలేకా, ఇంగ్లీషు రాదు కనకా, వగైరాలతో. ఆఖరికి ఎక్కడైనా తెలుగులో రాసిన కాయితం ముక్క లేదా తెలుగు పత్రికో, పేపరో కనబడితే ఆత్రంగా దాచుకుని పది పదిహేనుసార్లు చదువుకునేవాణ్ణి. అక్కడనుంచి మరో తెలుగేతర రాష్ట్రంలో తెలుగూ ఇంగ్లీషు రాని చోట, తెలుగూ ఇంగ్లీషూ మాత్రమే వచ్చిన నేను మరో నరకం అనుభవించాను మూడో భాష రాకా, అర్థం కాకా, వగైరాలతో. అప్పుడు నాకు దొరికిన ఒకే ఒక దారి రైల్వే స్టేషన్లో హిగ్గిన్ బాథమ్స్ అనే పుస్తకాలు అమ్మేషాపు. వాడు అక్కడ కొన్ని తెలుగు పత్రికలు అమ్ముతుంటే కొని తెచ్చుకుని వారాల తరబడి అవే చదివినవే చదువుకునేవాణ్ణి. అప్పటికి పోతనన్నీ, భద్రాచలం గోపన్ననీ మర్చిపోకుండా నోటికొచ్చిన పద్యాలు కాయితం మీద రాసుకుని గురువు, లఘువు వేసుకుంటూ, యమాతారాజభానస అనుకుంటూ అది చంపకమా ఉత్పలమా అనుకుంటూ ఉండేవాణ్ణి. నాకు అప్పుడూ ఈ తెలుగు వృత్తాలు సులభంగా రాయడం, గుర్తించడం రాదు, ఇప్పుడూ రాదు. ఇప్పుడు నేర్చుకోడానికి ఉత్సుకతా లేదు. పద్యం, భావం చాలు నాకు.

మరి కొంతకాలానికి, చేతిలో డబ్బులు ఆడుతుంటే పోతన భాగవతం దొరుకుతుందేమో అని కనబడిన అన్ని షాపుల తిట్టూ తిరిగాను. ఎక్కడా దొరకలేదు కానీ గజేంద్ర మోక్షం, కొన్ని వామనావతారం పద్యాలు లాంటి చిన్న పుస్తకాలు దొరికేయి. అమెరికా వచ్చాక భాగవతం లో చిన్న భాగం పుస్తకంగా అమ్ముతుంటే కొన్నాను. అది నాకు నచ్చలేదనుకోండి అది వేరే సంగతి. ఇంక ఈ భాగవతం పుస్తకాలు మనకి దొరకవు, “కలడు కలండనెడువాడు కలడో లేడో…” అనుకుంటూ ఉన్నప్పుడు నా అదృష్టం కొద్దీ శ్రీ ఊలపల్లి సాంబశివరావుగారి వెబ్ సైటు (https://telugubhagavatam.org/) కనిపించింది. అది పూర్తిగా చదవలేదు అప్పటికి. కానీ దేశం వెళ్ళడానికి ప్రయత్నాలు జరుగుతున్నై. వెళ్ళేముందు నిర్ణయించుకున్నది ఏమంటే – ఇహాసనే శుష్యతు మే శరీరం, త్వగస్థి మాంసం ప్రళయం చ యాతు అనుకున్న బుద్ధుడంతటి సరుకు మనకి ఏ కోశానా లేదు కానీ - ఈ సారి మాత్రం తప్పకుండా దేశం నుంచి ఎలాగో ఒకలాగ భాగవతం కొనుక్కురావాలి అనుకుని బయల్దేరాను. తిరుమలలో పుస్తకాల షాపుకి వెళ్తే అక్కడ పుస్తకాలు వరసగా పేర్చి ఉన్నాయి. అందులో దొరికినవి గబ గబ ఏరితే పోతన భాగవతంలో ఐదు పుస్తకాలలో మూడే సంపుటాలు కనిపించాయి. ప్రాణం ఉసూరుమనిపించింది కానీ ఆశ చావక అక్కడ కుర్రాణ్ణి అడిగాను మిగతావి లేవా అని. ఆయన అన్నాడు – “ఎందుకండీ అంత శ్రమ ఇవి ఏరడానికి, మొత్తం భాగవతం ఐదేసి పుస్తకాలు కట్టకట్టి ఒకసారి అమ్ముతున్నాం; అటు చూడండి.” ఆయన చూపించిన చోట చూస్తే నిలువెత్తు కట్టల భాగవతం – అన్ని భాగాలు ఉన్న ఐదేసి సంపుటాలు. ఎంత సంతోషం!! అలా మొత్తానికి ఆ పుస్తకాలు నా చేతిలోకొచ్చాయి. ఇన్నాళ్ళూ నన్ను భగవంతుడు ఏడిపించి ఆ పుస్తకాల కోసం తిప్పాడు. ఇప్పుడో? ఆ పుస్తకాలు, శ్రీ సాంబశివరావుగారి వెబ్ సైటు, ఈ మధ్య వారు ప్రచురించిన భాగవతం ఆప్ తో మొత్తం అన్నీ అరచేతిలోకి వచ్చాయి. ధన్యోస్మి! అలా భాగవతం చదవడం మొదలుపెట్టాను.

కొంతకాలం గడిచాక తెల్సింది; ఇది కాదు పద్ధతి అని ఈ గ్రంథం చదివే విషయంలో అని. అప్పుడు ఈ పుస్తకాలు పూజ గదిలో పెట్టి పూజ అయ్యాక సరస్వతీ నమఃస్తుభ్యం… అని రోజూ మొదలుపెట్టి రోజుకి ఇన్ని పేజీలు

అనుకుంటూ చదివాను. మరోసారి ధన్యోస్మి. ఇటువంటి పద్యాలు చదివాక ఇంక వీటి గురించి రాయడం, అవి కౌముది కి పంపడం శ్రీ కిరణ్ ప్రభగారు ఒప్పుకోవడం అన్నీ పలికించెడి వాడి అనుగ్రహమే. లేకపోతే తెలుగే సరిగ్గా చదువుకోని, మాట్లాడలేని, రాయలేని నేనేమిటి, తెలుగు పుణ్యపేటి అయిన పోతన, ఆయన రాసిన భాగవతం పద్యాలమీద వ్యాసాలు రాయడం ఏమిటి? ఇప్పుడు చేతిమీద గిల్లి చూసుకుంటే పది సంవత్సరాలు ఎలా గడిచాయి? జస్ట్ లైక్ దట్? అనిపిస్తోంది. ఈ నెల నుంచి పదకొండో సంవత్సరంలో కొనసాగిస్తున్నాను. ఇవి ఎంతకాలం రాస్తానో, అసలు ఇంకెన్ని రాయగలనో, రాయించగలడో, (టైపు, కాపీ, పేస్టించగలనో/డో అనాలేమో మరి) అనేది ఆ పెద్దాయన ఇష్టం. ఇప్పుడు ఇంక నేను కోరుకునేది ఒకటే - తన్మే మనః శివసంకల్పమస్తు.

ఈ సందర్భంలో భాగవతం చదవడం గురించి ఒక మాటగా శ్రీ రామకృష్ణా మఠం లో శ్రీ రామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులు (పేరు మర్చిపోయాను) అయిన ఒక స్వామి గారి మాట గుర్తు చేసుకోవడం ఉత్తమంగా ఉంటుంది. ఆయన ఒక శిష్యుడితో మాట్లాడుతున్నప్పుడు భగవద్గీత ప్రస్తావన వచ్చింది. ఆ శిష్యుడు అన్నాట్ట, 'భగవద్గీతా? అవునండి నేను చదివేసాను దాన్ని.' అప్పుడు స్వామిగారి సమాధానం ఏమిటంటే, 'ఎప్పుడూ అలా అనకు, భగవద్గీత చదివేసాను అని చెప్పడం సరికాదు, దాన్ని చదువుతున్నాను అనాలి. ఎందుకంటే అది ఒకసారి చదివేస్తే అర్ధమయ్యేది కాదు. దాని పేరే భగవంతుడి నోట్లోంచి వచ్చిన వాక్యం అని కదా? అవ్యక్తుడైన భగవంతుణ్ణి అర్ధం చేసుకుంటే తప్ప ఎవరూ కూడా భగవద్గీత నేను చదివేశాను అని చెప్పడానికి అర్హులు కాదు.' బాగుంది కదా? (అనంతమవ్యయం కవిం సముద్రేంతం విశ్వసంభవం ... అని కదా మంత్ర పుష్పం) పోతన కావ్యం కూడా ఇటువంటిదే. దాన్ని ఎన్ని సార్లు చదివితే దాని గొప్పదనం అంత అర్ధమౌతుంది. పాఠ్యపుస్తకాలలో పరీక్షల్లో ఉత్తీర్ణతకి ఓ రెండో మూడో పోతన పద్యాలు చదివేసి కంఠతా పట్టి మర్చిపోవడం; కొన్ని పద్యాలు, ఒక స్కంధం లేదా ఓ ఖండం చదివి పోతన ఇలా రాశాడు, పరీక్షిత్తు ఎందుకలా చేసాడు, కృష్ణుడు అలా చేసాడు అని మనకున్నచదువూ డిగ్రీలతో, అహంకారంతో, నాకు తెలుసు అనే 'వివేకం, విజ్ఞత' తో శతవిధాలుగా పరీక్షలు చేసి వెక్కిరించడానికి భాగవతం చదవకూడదు. తెలుగు భాషని ఎలా వాడవచ్చో, భగవల్లీలలు ఎలా ఉంటాయో అర్ధం అవడానికి అనేకానేక సార్లు చదవాలి; కాదు కాదు, స్వామి గారు చెప్పినట్టూ అలా చదువుతూనే ఉండాలి. ఏనాటికీ 'నేను భాగవతం చదివేసాను' అనేది మనసులోకి రానే రాకూడదు. కనీసం నా మట్టుక్కి నేను అలా వీలున్నప్పుడల్లా చదువుతూ ఈ గ్రంథాన్ని ఆస్వాదించగలుగుతున్నాను.

ఇప్పటికీ భాగవతంలో నాకు నచ్చినది మరో సారి చెప్పనీయండి – నిస్సందేహంగా అది వామనావతారం. దీన్ని పుస్తకంగా పెట్టారు కూడా (https://koumudi.net/books/KOUMUDI_VAAMANAAVATARAM.pdf) శ్రీ కిరణ్ ప్రభగారు. ఇందులో బలి చక్రవర్తి ఆకాశమంత ఎత్తులో త్రివిక్రముడైన మహావిష్ణువు తో దీటుగా నిలబడి 'నిరయంబైన నిబద్ధమైన, ధరణి నిర్మూలనంబైన..." అంటూ కనిపిస్తాడు. వీలు చూసుకుని ఎప్పుడో బలి చక్రవర్తి గురించీ ఆయన ప్రొజక్ట్ మేనేజ్ మెంట్ స్కిల్ సెట్ గురించీ రాయాలి. దాని మీద నోట్స్ రాసిపెట్టుకున్నాను. అది వెతికి తీసి చూడాలి. అది కూడా పలికించెడి/రాయించెడి వాడి కృప మీద ఆధారపడి ఉంది.

ఇంతవరకూ చెప్పాక ఇది చెప్పితీరాలి – ఈ రసగుళికలు ప్రచురించే శ్రీ కిరణ్ ప్రభగారికీ, భాగవతం వెబ్ సైట్ శ్రీ సాంబశివరావుగారికీ శిరస్సు వంచి పాదాభివందనం, ధన్యవాదాలు. ప్రపంచంలో ఏదైనా పని చేయాలంటే 'దాన్ని గురించి ఆలోచించాలి, కష్టపడాలి, అదే జీవితం అన్నట్టూ కలగనాలి. అదే తిని అదే పడుకోవడం చేయాలి; అప్పుడు మొత్తం త్రిభువనాల్లో శక్తులన్నీ తోడై నీ వెనక ఉండి సహకరిస్తాయి ఆ పని పూర్తి కావడానికి' అంటారు స్వామి వివేకానందులు. నాకు ఈ భాగవతం పుస్తకాల విషయంలో ఆయన చెప్పినది పూర్తిగా నిజమైంది. పుస్తకాలు దొరకడానికి ఆలస్యం అయితేనేం? మరోసారి ధన్యోస్మి.

ఈ వ్యాసాలు రాయడం మొదలు పెట్టడం కూడా మార్గశిర మాసంలో మొదలవడం (మాసానాం మార్గశీర్షోహం అని కదా భగవద్గీత) భాగవతం పుస్తకాలు ఇన్నేళ్ళు కష్టపడ్డాక నాకు తిరుమల కొండ మీద మాత్రమే దొరకడం అవన్నీ భగవంతుడి కృప అనుకుంటున్నాను.

చదువుతున్న పాఠకులకి ధన్యవాదాలు.

శర్మ దంతుర్తి

COMMENTS